మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యం

- ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి
- మహిళలతో మన ఎమ్మెల్యే కార్యక్రమం ప్రారంభం

బుక్కరాయసముద్రం: రాష్ట్రంలో మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని నీలాంపల్లి గ్రామంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు పురస్కరించుకుని ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మహిళలతో మన ఎమ్మెల్యే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ముందుగా గ్రామంలో వెలసిన నాగలింగేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్యతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలతో మన ఎమ్మెల్యే కార్యక్రమం ప్రారంభించారు. మహిళలతో నేరుగా మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నారన్నారు. సంక్షేమ పథకాలు నేరుగా మహిళల చెంతకే చేర్చేలా ప్రభుత్వ యంత్రాంగం పటిష్టంగా పని చేస్తోందన్నారు. ప్రతి మహిళా పిల్లలను బాగా చదివించుకోవాలన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, పైలా నరసింహయ్య

సంక్షేమ పథకాలను రానివారు ఉంటే చెప్పాలని ఎమ్మెల్యే మహిళలను కోరారు. జగనన్న అందిస్తున్న పథకాలను ఎంతో సంతోషకరంగా ఉన్నాయని.. మరో మారు జగనన్నే సీఎం కావాలని ఎమ్మెల్యే ఎదుట పలువురు మహిళలు సంతృప్తిని వ్యక్తం చేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేలు ఇలా ప్రజల చెంతకు వచ్చి ఏనాడూ మాట్లాడలేదని తమ కష్ట సుఖాలు ఎప్పుడూ అడిగి తెలుసుకోలేదని లక్ష్మీదేవి అనే మహిళ పేర్కొంది. టీడీపీ ప్రభుత్వంలో తమకు సరిగా పథకాలు అందేవి కాదని రసూల్‌బీ తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ భాస్కర్, నాటక అకాడమీ చైర్‌పర్సన్ ప్రమీల, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ భూమిరెడ్డి సునీత, వైస్ చైర్‌పర్సన్ గీత, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అంకే నరేష్, సర్పంచులు రసూల్‌బీ, పార్వతి, లక్ష్మిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ బయపరెడ్డి, ఎంపీటీసీ కాలువ వెంకటలక్ష్మి, నాయకులు అంజిన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, మసూద్ వలి, సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిక

నీలాంపల్లిలో టీడీపీ నుంచి 20 కుటుంబాలు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరాయి. ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలన్నారు. నరసింహులు, మునిస్వామి, భాస్కర్, శీనయ్య, సుధాకర్, రసూల్ బాషా, ప్రసాద్, నాగార్జున జగనన్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైఎస్సార్ సీపీలోకి చేరుతున్నామని తెలిపారు. జెడ్పీటీసీ భాస్కర్, మండల కన్వీనర్ అంకే నరేష్, జేసీఎస్ మండల కన్వీనర్ బయపరెడ్డి, సర్పంచ్ రసూల్ బీ, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, సాంబశివారెడ్డి, మసూల్ వలి, సాంబశివుడు, చికెన్ నారాయణస్వామి, బుల్లే రాజా, శేషానందరెడ్డి, లక్ష్మి నారాయణ, నూర్ మహమ్మద్, ఎంపీటీసీ అంజిన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజకుళ్లాయప్పకు ఎమ్మెల్యే అభినందనలు



రాజకుళ్లాయప్పను అభినందిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

శింగనమల: బుక్కరాయసముద్రం మండలం చెన్నంపల్లికి చెందిన దళిత బిడ్డ బి.రాజకుళ్లాయప్ప ఎస్ఐగా ఎంపికకావడంతో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అభినందించారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రాజకుళ్లాయప్పకు స్వీట్ తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని, తల్లితండ్రులు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆయనకు సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు శ్రీరాములు, కుళ్లాయప్ప, అగ్రహారం నారాయణ, రాజు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్రీడామైదానాల పరిశీలన



క్రీడామైదానాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

గుత్తి: గుత్తి, గుత్తి ఆర్ఎస్ లలోని క్రీడామైదానాలను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు పరిశీలించారు. ఈ నెల 26న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో కమిషనర్ గుత్తిలోని ఎంఎస్ క్రీడామైదానం, ఆర్ఎస్‌లోని రైల్వే క్రీడామైదానాన్ని పరిశీలించి ఏర్పాట్లుపై అధికారులతో చర్చించారు.

భూసార పరీక్షలపై అవగాహన



ఈస్ట్ నరసాపురంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ విద్యార్థినులు

శింగనమల: ఈస్ట్ నరసాపురం గ్రామంలో శుక్రవారం భూసార పరీక్షలపై బద్వేల్ ఎస్‌బీవీఆర్ అగ్రికల్చర్ కళాశాల విద్యార్థినులు రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ భూసార పరీక్షల వల్ల భూమిలో ఉండే పోషకాలు తెలుస్తాయన్నారు. వాటి ఆధారంగా ఎరువులు వేసుకుంటే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. తక్కువ ఉన్న పోషకాలకు వాటికి సంబంధించి ఎరువులు మాత్రమే వేసుకోవాలని సూచించారు.

ఐటీఐలో బ్రిడ్జి కోర్సుపై ఉచిత శిక్షణ

గుంతకల్లుటౌన్: ఐటీఐ రెండేళ్ల కోర్సు పూర్తి చేసిన వారు నేరుగా పాలిటెక్నిక్ సెకండియర్‌లో ప్రవేశం పొందడానికి నిర్వహించే బ్రిడ్జి కోర్సుకు అనంతపురం ప్రభుత్వ ఐటీఐలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈమేరకు స్థానిక ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ టి.నరేంద్రనాథ్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి కలిగిన వారు ఐటీఐలో ఈ నెలాఖరులోగా సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలియజేశారు.

ఘనంగా సెమీ క్రిస్మస్



విద్యార్థులకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

పామిడి: నీలూరు సీఎస్ఐ ఎయిడెడ్ స్కూల్‌లో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా క్రిస్మస్ ప్రాముఖ్యతను స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ ఎం జాన్ సుధీర్ వివరించారు. అనంతరం డాక్టర్ సీ స్వరూపరాణి, జాన్‌సుధీర్ ఆధ్వర్యంలో స్కూల్ విద్యార్థులకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం సంజీవరాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.


రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయులకు గాయాలు



తీవ్రంగా గాయపడిన శామ్యూల్ ప్రతాప్

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయ దంపతులు శామ్యూల్ తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. గుత్తి ఆర్ఎస్‌కు చెందిన ఉపాధ్యాయ దంపతులు శామ్యూల్ ప్రతాప్, జలజాక్షి గుత్తిలోని కోట ఉన్నత పాఠశాలలో పని చేస్తున్నారు.ఈ క్రమంలో పాఠశాలకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. అయితే ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద రోడ్డు కు అడ్డంగా ఓ మహిళ వచ్చింది. ఆమెను తప్పించబోయి బైక్ అదుపు తప్పి కింద పడ్డారు. ప్రమాదంలో శామ్యూల్ ప్రతాప్, జలజాక్షి దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

దత్తాత్రేయుడికి ప్రత్యేక పూజలు



దత్తాత్రేయుడిని పూజిస్తున్న దృశ్యం

పామిడి: స్థానిక దత్త మహాయోగ పీఠంలో శుక్రవారం దత్త నవరాత్రుల పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. దత్తాత్రేయుని శోభాయానంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు దత్తాత్రేయుడిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈసందర్భంగా ఆలయ పీఠాధిపతి సురేంద్ర మహారాజ్ ఆధ్వర్యంలో దత్రాతేయునికి అభిషేక, హోమాలు నిర్వహించారు. అనంతరం భక్తాదులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

మాజీ ఎమ్మెల్యే గాదిలింగప్ప సేవలు మరువలేనివి



గాదిలింగప్ప చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లు టౌన్: బడుగు, బలహీన వర్గాల నేత దివంగత గుత్తి మాజీ ఎమ్మెల్యే గాదిలింగప్ప నియోజకవర్గ అభివృద్ధికి అందించిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పాతబస్టాండ్ పోలేరమ్మ గుడి వద్ద గాదిలింగప్ప 20వ వర్ధంతి సభ నిర్వహించారు. గాదిలింగప్ప చిత్రపటానికి ఎమ్మెల్యే వైవీఆర్, మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని తదితర ప్రముఖులతో పాటు అభిమానులు పూలు వేసి నివాళులర్పించారు. గుత్తి ఎమ్మెల్యేగా రెండు సార్లు గెలిచిన గాదిలింగప్ప ఈ ప్రాంతాన్ని బాగా అభివృద్ధి చేశారని చెప్పారు. జిల్లాలో బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. గాదిలింగప్ప తనయుడు, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ గాదిలింగేశ్వర బాబు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గాదిలింగప్ప సతీమణి, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ ఎస్.వెంకటలక్ష్మి, గాదిలింగేశ్వరబాబు, మాజీ చైర్మన్ జింకల రామాంజినేయులు, ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ వీరాంజినేయులు, పార్టీ కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు, కోఆప్షన్‌సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి టాలెంట్ టెస్టు విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందిస్తున్న గేట్స్ యాజమాన్యం

గుత్తి: గేట్స్ ఇంజనీరింగ్ కాలేజీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా స్థాయి టాలెంట్ టెస్టు విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ నెల 17 నుంచి జిల్లా వ్యాప్తంగా ఉన్న జూనియర్ కళాశాలలు, ఉన్నత పాఠశాల విద్యార్థులకు మ్యాథమ్యాటిక్స్ టాలెంట్ టెస్టులు నిర్వహించారు. కళాశాలల విభాగంలో సత్యసాయి ఇంటర్ కాలేజీ(అనంతపురం)కి చెందిన సుస్మిత, మహాత్మా జూనియర్ కాలేజీ(గుత్తి)కి చెందిన సాయి తేజశ్రీ, నలందా కాలేజీ(అనంతపురం)కి చెందిన యష్మిత, ఉన్నత పాఠశాలల విభాగంలో వివేకానంద పాఠశాల(గుత్తి)కి చెందిన త్రిష, మోడల్ స్కూల్(పామిడి)కి చెందిన శ్రావణి, మోడల్ స్కూల్(గుత్తి)కి చెందిన సాయి సుమన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. వీరికి గేట్స్ కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, ప్రిన్సిపాల్ సురయ, అనంతపురం ఆర్ట్స్ కాలేజీ అధ్యాపకురాలు నాగ శశికళ, గుత్తి మ్యాథ్స్ అసిస్టెంట్ రాధిక బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతిగా ల్యాప్ టాప్, రెండో బహుమతి ట్యాబ్, మూడో బహుమతి స్మార్ట్ వాచ్‌ను అందించారు.

జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ పరీక్షకు ఎంపిక




జిల్లా స్థాయి చెకుముకి పరీక్షకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

గుంతకల్లు: స్థానిక రాధాకృష్ణ మున్సిపల్ బాయ్స్ హైస్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ పరీక్షలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం రవికుమార్ శుక్రవారం తెలిపారు. చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా మండల స్థాయి సైన్స్ పరీక్షలను పట్టణంలోని భగత్ సింగ్ మున్సిపల్ పాఠశాలలో నిర్వహించారన్నారు. తమ పాఠశాల నుంచి పరీక్షలు రాసిన జయశ్రీ, వాణిఅత్రి, ఓంకార్ మొదటి స్థానంలో నిలిచి జనవరి 7న జరిగే జిల్లా స్థాయి చెకుముకి పరీక్షకు అర్హత సాధించారన్నారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థులకు ఎంపికైన పత్రాన్ని అందజేశారు. హెచ్‌ఎంతోపాటు సైన్స్ ఉపాధ్యాయులు రామకృష్ణ, రూపవాణి, రాజేశ్వరరావు, శ్రీనివాసులు విద్యార్థులను అభినందించారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ

యాడికి: మండల కేంద్రంలోని అగాపే వృద్ధాశ్రమంలో క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని శుక్రవారం విశ్రాంత ఉద్యోగి ఈటే ఇజ్రాయిల్ రూ. 20 వేలు విలువ చేసే దుస్తులను వృద్ధులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమ నిర్వాహకులు ప్రసాద్ పాల్గొన్నారు.

అయోధ్య రామయ్య అక్షింతల ఊరేగింపు



రామలక్ష్మణ,సీత విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని శుక్రవారం రామ భక్తులు , బీజేపీ నాయకులు, రామస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అయోధ్య రామయ్య(రాముడు) అక్షింతలు, విగ్రహాలను ఊరేగించారు. కోటలోని రామస్వామి ఆలయం నుంచి తలపై భక్తులు అయోధ్య అక్షింతలను పెట్టుకుని పట్టణవీధుల్లో నడిచారు. జై శ్రీరామ్, జై శ్రీరామ్, జైజై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. భక్తులు ఆనందంతో చిందులు వేశారు. ఇంటింటికి అయోధ్య నుంచి తెచ్చిన అక్షింతలు పంపిణీ చేశారు.

మెరుగైన వైద్యసేవలందించండి



స్వప్న నర్సింగ్ హోంలో వైద్యులతో మాట్లాడుతున్న రవిశంకర్

గుంతకల్లు: రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని డీపీఎంవో ఎస్‌హెచ్‌ఎం డాక్టర్ రవిశంకర్ ఆస్పత్రి నిర్వాహకులకు సూచించారు. శుక్రవారం పట్టణంలోని సాయికృష్ణ, స్వప్న నర్సింగ్ హోమ్‌లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా ఆస్పత్రిలోని స్కానింగ్ చేయడానికి ప్రభుత్వ ఇచ్చిన అనుమతి పత్రాలను పరిశీలించారు. ఆస్పత్రిలోని వైద్యుల రిజిస్ట్రేషన్‌తోపాటు ఇటీవల అబార్షన్ చేసిన వారి వివరాలపై ఆరా తీశారు. అనంతరం తిలక్‌నగర్‌లోని ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అంతకు ముందు మున్సిపల్ కార్యాలయంలో హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

మదరసా భవన నిర్మాణానికి ఆర్థికసాయం



నిర్మాణంలో ఉన్న మదరసా భవనం

గుంతకల్లు: తిమ్మనచర్లలో మదరసా భవన నిర్మాణానికి సబ్ రిజిస్ట్రార్ ఎస్.శామీర్‌బాషా ఆర్థిక అందజేసినట్లు ఇలాహి మసీదు కమిటీ నాయకులు శుక్రవారం తెలిపారు. ఇలాహి మసీదులో చిన్న రేకుల షెడ్డులో ఏర్పాటు చేసిన మదరసాలో దాదాపు 40 మంది పిల్లలు అరబిక్ అభ్యసించేవారు. అయితే షెడ్డు శిథిలావస్థకు చేరడంతో అక్కడ ఉన్న ముస్లింల సాయంతో కొంత వరకు భవనం నిర్మించి వదిలేశారు. ఈ విషయమై ఎమ్మెల్యే వైవీఆర్ దృష్టికి తీసుకెళ్లగా ప్రత్యేక ఫండ్‌ను రిలీజ్ చేయించి ఆర్‌సీ స్లాబ్ వేయించారు. మతపెద్దలు సబ్ రిజిస్ట్రార్ శామీర్‌బాషాను సంప్రదించగా మసీదులో గ్రానైట్ ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థులకు బెంచీలు, పుస్తకాలకు ఆర్థిక సాయం అందించారు. ఇలాహి మసీద్ కమిటీ నాయకులు ఎమ్మెల్యే వైవీఆర్, సబ్ రిజిస్ట్రార్ శామీర్‌బాషాకు కృతజ్ఞతలు తెలిపారు.

గణితంపై ఆసక్తి పెంచుకోవాలి



రజాపురంలో విద్యార్థుల నమూనాలు పరిశీలిస్తున్న ఎంఈఓ రవినాయక్

గుత్తి రూరల్: ప్రతి విద్యార్థి గణితంపై ఆశక్తి పెంచుకోవాలని ఎంఈఓ రవినాయక్, హెచ్‌ఎం మహాలక్ష్మి సూచించారు. శుక్రవారం రజాపురం సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, బేతాపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలో విద్యార్థులు చేసిన గణిత శాస్త్ర నమూనాలను ఎంఈఓ, ప్రిన్స్‌పాల్ ఉషారాణి, హెచ్‌ఎం మహాలక్ష్మి పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ చిన్న వయస్సులోనే గణితంలో అమూల్యమైన ఆవిష్కరణలు చేసి భారత జాతి కీర్తిని ప్రపంచానికి చాటి చెప్పారన్నారు. రామానుజన్‌ను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి విద్యార్థి గణితంపై పరిశోధనలు చేయాలన్నారు. ఉపాధ్యాయులు ఓబుళపతి, రామకృష్ణయ్య, సులోచన, సాధన, నిరుపమ, మాదన్న, శివప్రసాద్, సేవాగఢ్ ప్రిన్స్‌పాల్ ఆదినారాయణరెడ్డి, వైస్ ప్రిన్స్‌పాల్ విజయ పాల్గొన్నారు.

పుట్లూరు: మండలవ్యాప్తంగా శుక్రవారం గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని పాఠశాలల్లో ఆయన గణిత సమాజానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. స్థానిక రాయలసీమ పాఠశాలలో విద్యార్థులు గణిత ఆకృతులను ప్రదర్శించారు.

గార్లదిన్నె: స్థానిక మోడల్ స్కూల్, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో శుక్రవారంజాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు రూపొందించిన నమూనాలను ఉపాధ్యాయులు పరిశీలించారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం అరుణకుమారి గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జీవిత చరిత్రను వివరించారు.

పామిడి: గణితశాస్త్ర మేధావి రామానుజన్ జయంతిని పురస్కరించుకొని స్థానిక చైతన్య స్కూల్‌లో శుక్రవారం జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గణితశాస్త్ర ప్రాముఖ్యతను స్కూల్ సీఈఓ కే సంతోష్‌రెడ్డి వివరించారు. అనంతరం విద్యార్థులు తమ గణితశాస్త్ర నమూనాలను ప్రదర్శించారు. స్కూల్ డైరెక్టర్ రమణారెడ్డి పాల్గొన్నారు.

తాడిపత్రి: ప్రముఖ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పట్టణంలోని శ్రీ వాణి స్మార్ట్ పాఠశాల, మౌర్య పాఠశాల, పద్మవాణి పాఠశాలల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు ఆకట్టుకున్నాయి. పద్మవాణి పాఠశాలలో విద్యార్థుల నమూనాలను ఎంఈఓ నాగరాజు తిలకించారు. శ్రీ వాణి స్మార్ట్ స్కూల్ కరస్పాండెంట్ కార్తీక్, మౌర్య పాఠశాల కరస్పాండెంట్ ఆంజినేయులు, పద్మవాణి పాఠశాల కరస్పాండెంట్ నాగపీరయ్య తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా కాజ్ వే మరమ్మతు



కాజ్ వే వద్ద పనులు చేస్తున్న దృశ్యం

పెద్దపప్పూరు: మండలంలోని అశ్వర్థనారాయణ స్వామి క్షేత్ర సమీపంలోని పెన్నానదిపై ఉన్న కాజ్ వే వద్ద మరమ్మతు పనులు శరవేగంగా సాగుతున్నాయి. ప్రజా సంక్షేమ పాదయాత్ర సందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి స్వామి దర్శనం కోసం విచ్చేసిన భక్తులు, వాహనచోదకులు భారీ వర్షాల కారణంగా కాజ్‌వే శిథిలావస్థకు చేరుకుందని మరమ్మతు చేయాలని ఆయనకు వివరించారు. ఎమ్మెల్యే ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి కాజ్ వే మరమ్మతులకు ప్రభుత్వం నుంచి రూ.35 లక్షలు మంజూరు చేయించారు. త్వరలో అశ్వర్థ నారాయణ స్వామి బ్రహ్మోత్సవాలు సమీపిస్తుండడంతో అధికారులు మరమ్మతు పనులను వేగవంతం చేశారు. వారం రోజుల్లోపు పనులు పూర్తయ్యే అవకాశాలున్నాయి.

తాళం వేసిన ఇళ్లలో చోరీకి యత్నం

గుంతకల్లుటౌన్: స్థానిక హనుమేష్‌నగర్‌లో తాళాలు వేసిన రెండిళ్లలో దొంగలు చోరీకి యత్నించారు. టూటౌన్ సీఐ గణేష్ తెలిపిన వివరాలు.. డీఎస్పీ కార్యాలయానికి సమీపంలో నివసిస్తున్న పి.సరోజమ్మ ఇంటికి తాళం వేసి తన కుమారుడి ఇంటికి వెళ్లింది. తాళాలను పగులగొట్టిన దుండగులు ఇంట్లోకి ప్రవేశించి చోరీకి యత్నించారు. బిగ్గరగా శబ్దం రావడంతో కిందింట్లో అద్దెకున్న వారు నిద్రలేచి కేకలు పెట్టడంతో దొంగలు పారిపోయారు. పరిటాల కల్యాణ మండపం ఎదురుగా ఉన్న మున్సిపల్ ఇంజనీర్ గురప్పయాదవ్ క్వార్టర్స్‌లోకి దొంగలు ప్రవేశించి ఒక్కపైసా కూడా దొరకకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. అనంతపురం నుంచి వచ్చిన క్లూస్‌టీమ్ సిబ్బంది ఘటనస్థలాల్లో వేలిముద్రలు సేకరించారు.

వైకుంఠ ఏకాదశి వేడుకలకు సర్వం సిద్ధం



ప్రత్యేక అలంకరణలో చింతల వెంకటరమణ స్వామి ఆలయం



ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసిన దృశ్యం

తాడిపత్రిటౌన్: చింతలవెంకటరమణ స్వామి ఆలయంలో శనివారం జరిగే వైకుంఠ ఏకాదశి వేడుకలకు సర్వం సిద్ధం చేశారు. దాదాపు 3 వేల మంది భక్తులు హాజరుకానున్నట్లు ఆలయ చైర్మన్ కందిగోపుల మురళీప్రసాద్‌రెడ్డి, ఈఓ సుబ్రమాణ్యం తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తుల సౌకర్యార్థం తాగునీరు, ప్రత్యేక తాత్కాలిక క్యూ లైన్‌లు, చలువపందిళ్ల ఏర్పాటు చేశారు. ఆలయాన్ని మామిడి తోరణాలు, పూల హారాలతో ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీదేవి, భూదేవి సమేత వెంకటరమణస్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

గార్లదిన్నె: మండల కేంద్రంతోపాటు మర్తాడు, కేశవాపురం, కల్లూరులోని వేంకటే శ్వరస్వామి ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శనివారం తెల్లవారుజామున 3 గంటలకు శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉత్తర ద్వారం గుండా దర్శనాలు ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రతిపక్ష ఎంపీలపై సస్పెన్షన్ ఎత్తివేయాలి



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

గుంతకల్లుటౌన్: పార్లమెంట్‌లో ప్రజాసమస్యలపై ప్రశ్నించిన ప్రతిపక్ష ఎంపీల సస్పెన్షన్‌ను ఎత్తివేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని సీపీఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఎంపీల సస్పెన్షన్‌ను వ్యతిరేకిస్తూ శుక్రవారం సీపీఎం నాయకులు పొట్టిశ్రీరాములు సర్కిల్‌లో నిరసన తెలిపారు. బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని వారు ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు డి.శ్రీనివాసులు, మారుతి, ఓబులేసు, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరం



శస్త్రచికిత్సకు ఎంపికైన వారు

పెద్దవడుగూరు: లక్షుంపల్లి పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం జన్ సంకల్ప్ ఫౌండేషన్, తాడపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కంటి వైద్యులు సుష్మిత, నిఖిత, పోచమ్మ సుమారు 65 మందికి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 18 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. వీరికి కడప జిల్లాలోని పుష్పగిరి కంటి ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గూడూరు సూర్య నారాయణ రెడ్డి, హరికృష్ణారెడ్డి, సత్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక స్టడీ హాల్ ప్రారంభం

అనంతపురం: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆధునిక స్టడీ హాల్‌ను జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లాలోని గ్రంథాలయాల ఆధునీకరణ, పోటీ పరీక్షల పుస్తకాలను తెప్పించి, పాఠకులు, పోటీ పరీక్షల అభ్యర్థులకు ఉపయోగపడేలా సంస్థ చైర్‌పర్సన్ ఎల్‌ఎం ఉమాదేవి కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ, మాజీ అధ్యక్షుడు ఎల్‌ఎం మోహన్ రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఎల్‌ఎం విష్ణువర్ధన్ రెడ్డి, ఉపగ్రంథాలయ అధికారి వి.సుబ్బరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజుల పాటు దత్తజయంతి

అనంతపురం కల్చరల్: స్థానిక ఉమానగర్‌లోని ప్రాచీన దత్తాత్రేయ స్వామి ఆలయంలో ఈనెల 25, 26 తేదీల్లో దత్తజయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ మేనేజర్ అప్పా సుధీర్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం మహా గణపతి పూజ, అనఘాష్టమి వ్రతం, రుద్రస్వాహాకార గాయత్రి నవగ్రహ హోమాలు, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 26న ఉదయం 6 గంటల నుంచి పౌర్ణమి వ్రతాలు, దత్తాత్రేయుడికి విశేష కవచాలంకారం, దత్త నామకరణ బ్రహ్మోపదేశం, శ్రీదత్త భిక్ష, పూర్ణాహుతి జరుగుతాయన్నారు.